# కోట గుమ్మం

అది రాజమహేంద్రపరానికి ప్రాణం వంటి శృంగాటకం. అంటే సెంటరు- ఇప్పటికీ అది 'కోట గుమ్మమే' అయితే కోటెక్కడ? గుమ్మం ఎక్కడ?

అక్కడ ఇప్పుడు సాక్షాత్కరించేవి — ఏమిటయ్యా? అంటే — మితాయి కోట్లు, హర్యానా దుప్పట్లు- అరటిపళ్ళంగళ్ళు, రైలు ప్రయాణీకుల పరవళ్ళు- మధ్యగా ఉరిమి చూచే 'ఆంధ్రకేసరి' నిలువెత్తు శిలా విగ్రహం— అన్నింటికీ శ్రీరామరక్ష!

పూర్వం- సుమారు ఏభై ఏళ్ళ కిందట, కుడిచేతివైపు ఎత్తయిన పెద్ద దిబ్బమీద ఒకే ఒక ముసలి చింతచెట్టు. అది కింద నడిచే జనాన్ని చూడదు. పండిపోయిన తల పైకెత్తి దిగులుగా ఆకాశంవైపు చూసేది. అది, అక్కడ పెద్ద కోటదేవిడీ. పెద్ద పెద్ద ఇత్తడి గుబ్బల తలుపులు, వంక. దార అన్నీ ఎరుగునేమో? లేక వాళ్ళ అమ్మగాని అమ్మమ్మగాని కథలు కథలుగా చెప్పేదేమో? అది, తెరవెనక్కుపోయిన చాళుక్య రాజ్య జ్ఞాపకాలకు శిథిల చిహ్నం - మరచిన రెడ్డిరాజుల శీర్షపతాకం. స్వాతంత్ర్య యుద్ధంలో అక్కడి ధీరులు తిన్న లాఠీదెబ్బలకు సాక్షి!

తెలుగువాళ్ళ కలల్లో, పౌరవృద్ధుల కళ్ళల్లో – లోలోపలి కళ్ళల్లో వుంది. ఆ కోట- కోటంటూ వుంటే ఆ కోటకు గుమ్మం అది!

అదిగో చూడు.

నన్నినారాయణభట్టూ, నన్నయ్యగారూ జరీ కాశ్మీర శాలువలు భుజం మీదనుంచి జారుతూండగా గంభీరంగా ఏదో తర్కించుకుంటూ లోపలికి వెడుతున్నారు. సేవకులు వంగి వంగి తప్పుకుంటున్నారు. 18 కట్టల మహా భారతం బరువుగా లోపలికి వెళ్ళి అక్కడ విడి ముసి ముసి తెలుగు నవ్వులతో, మూడు పువ్వులుగా బయటకు వస్తున్నది. ఇంకా ఆరుకాయలు కాలేదు.

ఇటు చూడు.

విభూతి ముద్రాంకిత ఫాలభాగంతో, మెడలో బంగారు రుద్రాక్ష తాపళంతో శ్రీనాథుడూ పట్టు అంగరఖాతో ఫగిడీతో అమాత్య - ఠీవితో అన్నయ్యమంత్రీ వీరభద్రారెడ్డి దగ్గరనుంచి వస్తున్నారు కాబోలు. శ్రీనాథుడు కుడిచేత్తో సవిలాసంగా పట్టుకున్న ఆ యినప గుండేమిటి? బాపురే! అది యినప గుండు కాదు. కాశీఖండం! రేపుదయానికి, లేకపోతే వారానికి, అది మల్లెచెండు కాబోతున్నది.

తెరజారింది- కల కరిగింది.

మళ్ళా చూడు–

మెలికలు తిప్పి చుట్టిన బుట్టంత తెలుగు తలపాగా, నిలువునా బొత్తాల పొడుగుకోటు, చుట్టు చెంగావిపంచ, సూదుల్లా గుచ్చుకునే చూపులు- గుబురు కనుబొమ్మలు – ఉరిమిచూస్తూ నించున్నాడు ఆ గుమ్మం దగ్గర. కోట పోయింది. గుమ్మం మాత్రం పేరుకు నిలిచి ఉంది. రాజీలేని హుంక

సింహం. పిడికిలి పైకెత్తి తర్జని చూపుతూ— ఊఁ. కదలరేం ? పొండి మా తెలుగు నేల నుంచి— అని గర్జిస్తే— ఆ గుమ్మంలోనుంచి గుత్తుల గుత్తుల చాదస్తాలు, గుడ్డి ఆచారాలు, నిర్జీవ శాస్త్రవాదాలు, పలాయనం చిత్తగిస్తున్నాయి. ఆ గుమ్మంలో నుంచే దూసుకు రమ్మని. కొత్త వెలుగులను, సరికొత్త చైతన్యాన్ని రెండు చేతులతోను ఆహ్వానిస్తున్నాడు— ఆ వీరుడు ! 1952 ప్రాంతం అనుకుంటాను.

బాట్లీ సినిమా హాల్లో జ. రా. పరిషత్తు షోడశోపచార పూర్వకంగా ప్రారంభం అయింది.

నేనూ ఆంధ్రసాహిత్య పరిషత్తూ ఒక్క సంవత్సరంలో పుట్టాం. నాకు దానిమీద సోదరప్రేమ అభిప్రాయభేదాల మాటకేంగాని— అది ఆంధ్ర సాహిత్యానికి చేసినసేవ ఏతన్మాత్రం కాదు. అపూర్వ శాసనాలు, అముద్రిత గ్రంథాలు సంపాదించింది. ఆంధ్రదేశ భాషాభిమాను లందరికీ భారద్వాజాశ్రమంలా పనిచేసింది. వచ్చినపని అయినట్టుంది. పటుత్వం తగ్గింది. వయసుడిగింది. కొత్త తరానికి భాషమీద, సాహిత్యంమీద తగిన రుచి కల్పించలేకపోయింది. వెనక్కి తిరిగింది.

'ఏఁగు'లో అరసున్న కలదా ? లేదా ?

'కందోయి'లో బిందు వెట్టు వచ్చినది ?

వీటిని గురించి కట్టలు కట్టలు సభల్లో చదవడం మొదలెట్టింది. అమృతాంజనం ధర పెరిగిపోయింది. యువకుడు శ్రద్ధగా విన్నాడు. అంజలిబంధంతో అడిగాడు; అయ్యా, అవి అచ్చువేస్తే కావలసిన వారు చదువుకుంటారు. మా క్కావలసింది అది కాదు. తిక్కన తెలుగు సొగసు చెప్పండి. నన్నయ వచఃశ్రీ వ్యాఖ్యానించండి. పాండురంగని గడుసుదనం

రుచి చూపండి- అంటే ఆ మాట గాల్లో కలిసిపోయింది. సాహితీ సమితి పుట్టింది. అంటే పరిషత్తు పుట్టించింది.

చిత్రం ! సాహితీ సమితి ముఖ్యులు చాలమంది ఎందుకో ఆ రోజు అక్కడ ఉన్నారు. తల్లావఝ్ఝుల, మొక్కపాటి, ముద్దుకృష్ణ, దీక్షితులు, ఇంకా యువకు లెందరో !

వడ్డాది సుబ్బారాయుడుగారు అధ్యక్షులు- అప్పటికే వృద్ధులు; అధ్య క్షోపన్యాసం ఎవరో చదివారు. జాషువా నవ్యదృష్టి గల కవి అని యువకు లకు అభిమానం. కాని ఆయన కూడా ప్రేమకవిత్వాన్ని వెక్కిరిస్తూ "ఎవరా అమ్మాయిని చూపుమయ్య" అని పద్యాలు చదివితే ఆశాభంగం చెందారు.

సభ చివరి కొచ్చింది. ఆధునికుల్లో ఎవరైనా మాటలాడ దలచు కుంటే రావచ్చు అని ఒకరు ఆహ్వానించారు. శివశంకరశాస్త్రి వెళ్ళబోయి ముద్దుకృష్ణను పంపారు. ముద్దుకృష్ణలో మిరియంపా లెక్కువ. వెళ్ళి "నమ స్కారం, ఈ అవకాశం వస్తుం దనుకోలేదు. వచ్చింది. మా ఉనికి గుర్తిం చారు. సంతోషం. మీకున్న భాషాభిమానంకంటె మాకేమీ తక్కువలేదు. మార్గంలోనే పేచీ. మనం అన్నదమ్ములం. మేం విడిపోయాం. మీకూ మాకు పొసగదు. ఇప్పుడు నన్నయ, శ్రీనాథుడు బతికివుంటే తప్పకమాతో వుండేవారు. వారికి సాహిత్యంలో చైతన్యం కావాలి. శవాలంకరణ అక్కర లేదు" అని కూమన్నాడు.

అదే కోట గుమ్మంలోంచి తెలుగు కవిత్వంలో బాదస్తం తల వంచుకు వెళ్ళిపోయింది.

అందులోంచే గౌతమీ తరంగాహ్వానాలతో నవ్యభావం, ఉజ్జీవం రాజరాజు పట్టణంలో తీవిగా ప్రవేశించాయి.